క్లుప్తంగా

శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలోని అన్ని శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కట్టమంచి శ్మశాన వాటికను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్థలం కొరత ఉండడంతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు అధికారులకు తెలియజేశారు. పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు ఆక్రమణలు ఏవైనా ఉంటే తీసేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండీవీధిలో పర్యటించి, ఇక్కడ మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, సిబ్బంది ఉన్నారు.

బాలికలకు అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి జానకీరావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు పరిధిలోని మురకంబట్టు ప్రాంతంలోని మైనారిటీ బాలికల హైస్కూల్‌లో గురువారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి జానకీరావు వ్యాధి వ్యాప్తిపై బాలికలకు అవగాహన కల్పించారు. అనుమానిత కేసులను పరీక్షించి పలు సూచనలు చేశారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, నరాల సమస్యలు, తిమ్మిర్లు తదితర లక్షణాలు ఉంటాయని వివరించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా వైద్యసేవలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ జాన్, డీపీఎంఓ కానిక్‌రాజ్, సీఓ గోపి, స్కూల్ ప్రిన్సిపల్ శోభ, ఆశా వర్కర్ నాగమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రీయ బ్రాహ్మణసంఘ కోర్డినేటర్‌గా రామభద్ర



నియామకపత్రం అందుకుంటున్న రామభద్ర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కోర్డినేటర్‌గా రామభద్ర ఎన్నికయ్యారు. విజయవాడలోని సత్యనారాయణపురంలో గురువారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య సమక్షంలో ఎన్నికైన ఆయన పత్రాన్ని అందుకున్నారు. కాగా జిల్లాలోని పలువురు బ్రాహ్మణ సంఘనేతలు ఆయనను అభినందించారు.

జాతీయస్థాయి పరీక్షలో రమణ ప్రతిభ



పత్రం అందుకుంటున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నెట్‌వర్క్ ఎఫ్‌పీ నిర్వహించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్వాలిఫైడ్ పర్సనల్ ఫినాన్స్ ప్రొఫెషనల్‌లో ఏఎం ఎఫ్‌ఐ రిజిస్టర్ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ రమణ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ముంబైలో జరిగిన స్నాతకోత్సవంలో ఆర్థిక సేవల పరిశ్రమ అనుభవజ్ఞులు అమిత్ త్రివేది ధ్రువీకరణ పత్రం అందజేశారు.

రూ.15.58 లక్షలతో ల్యాబ్ ఏర్పాటు

రొంపిచెర్ల: మండలకేంద్రం రొంపిచెర్ల బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కెమిస్ట్రీ ల్యాబ్‌ను నిర్మించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ తెలిపారు. గురువారం ఆమె ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఎస్ఆర్‌ఐ పథకం కింద ల్యాబ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు ల్యాబ్‌లో ప్రయోగాలు చేసేందుకు పరికరాలు కూడా వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో పరికరాలు వస్తే వాటి ద్వారా పిల్లలతో ప్రయోగాలు చేయిస్తామన్నారు. అలాగే బాలురు, బాలికల పాఠశాల పరిధిలోని క్లస్టర్ స్కూళ్లకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ వచ్చిందని తెలిపారు. మరుగుదొడ్లు క్లీనర్ శానిటైజర్లు, టాయిలెట్ బౌల్ క్లీనర్లు, ఎయిర్ ఫ్రెషనర్లను ఇస్తామన్నారు.

వలసలు అరికట్టి ప్రతి పేదవాడికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో పక్కదారి పట్టింది. పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన కొందరు అధికారులు, అధికార పార్టీ నేతలు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి భారీఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. అసలు కూలీలు పనికి రాకుండానే వచ్చినట్లు హాజరు వేసి డబ్బులు కాజేస్తున్నారు. దీంతో పథకం అమలులో అవినీతి, అక్రమాలు తారాస్థాయికి చేరడంతో కేంద్రప్రభుత్వం వాటికి చెక్‌పెట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూలీల ఫొటోలను పక్కాగా తీసి అప్‌లోడ్ చేసేందుకు యాప్‌ను తీసుకొచ్చింది. అయితే ఇదీ ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పకడ్బందీగా ఉపాధి..

- ఉపాధి హామీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్లాన్
- పథకం అమలులో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రణాళిక
- మస్టర్ల మాయజాలంపై వ్యూహాత్మక నిర్ణయం
- ఉదయం.. సాయంత్రం రెండుసార్లు కూలీల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను తీసుకువచ్చింది. దొంగ మస్టర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పనులకు సంబంధించి మస్టర్లలో నమోదు చేసిన కూలీలకు పని చేసే చోట రెండు పర్యాయాలు ఫొటోలు తీసి.. ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఉదయం పనికి రాగానే ఒకసారి.. సాయంత్రం నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటోలు తీసి.. వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కూలీలకు వేతన చెల్లింపులకు ఫొటోలు తప్పనిసరి. ఏరోజుకారోజే పనికి హాజరైన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక రోజుకు సంబంధించిన ఫొటోలు తరువాతి రోజు అప్‌లోడ్ చేయడానికి వీలు పడదు.

అమలు తీరు ఇలా..

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ.. ఎంపీడీఓలకు నివేదిక అందజేయాలి. ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు చెక్ చేయాలి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వచ్చిన ఫొటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి. క్షేత్రస్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

వచ్చే నెల నుంచి అమలు..

ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఉపాధిహామీ పథకంలో కూలీలకు రెండు పూటలా ఫొటోలు తీస్తారు. క్షేత్రస్థాయిలో ఫీల్‌అసిస్టెంట్లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ ఉంటుంది. మండల, జిల్లాస్థాయి అధికారులకు కూడా ఫొటోలు పంపించాల్సి ఉంటుంది. దీనిపై అలసత్వం వహిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తప్పవని అధికారులు క్షేత్ర సహాయకులకు సూచిస్తున్నారు.

మండలం పేరు	జాబ్‌కార్డుల సంఖ్య	కూలీల సంఖ్య
చిత్తూరు	4954	8857
గుడిపాల	5312	7053
పూతలపట్టు	7345	12514
ఐరాల	638	15951
తవణంపల్లి	6393	11368
యాదమరి	7124	11798
బంగారుపాళ్యం	12340	21019

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ ఇందిర

యాదమరి: విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని చిత్తూరు డీవైఈఓ ఇందిర సూచించారు. గురువారం ఆమె మండల పరిధిలోని కె.గొల్లపల్లి హైస్కూల్ ప్లస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పరీక్షల్లో 590 మార్కులు రావడానికి ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం కృషి చేయాలని.. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తయారు చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని, అందుకనుగుణంగా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి ప్రత్యేక తరగతుల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. భోజన ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దాదాపు రెండు గంటలకు పైగా పాఠశాలలో ఉన్న ఆమె ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషజీవితం ఆనందంగా గడపండి



ఏడీ సాంబశివారెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన ముఖ్య ప్రణాళిక శాఖ (సీపీఓ) అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి శేషజీవితం ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు ఏడీ సాంబశివారెడ్డి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య ప్రణాళిక శాఖలో ఏడీగా నిబద్ధతతో విధులు నిర్వహించిన సాంబశివారెడ్డి సేవలు చిరస్మరణీయమన్నారు. 37 ఏళ్ల పాటు అంకితభావంతో పని చేశారన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ముఖ్య ప్రణాళిక శాఖలో సభ్యులేనని చెప్పారు. ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చన్నారు. నిబద్ధతతో పని చేసే అధికారులు కిందిస్థాయి సిబ్బందికి మార్గదర్శకులన్నారు. అనంతరం ఏడీ దంపతులకు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ముఖ్య ప్రణాళిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం.. పాశుపతాస్త్రం



పోటీల్లో గెలుపొందిన వివిధ కళాశాలల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రం అని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఈ మేరకు గురువారం ఆ కళాశాలలో సమాచారం హక్కు చట్టంపై జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటి వరకు తీసుకొచ్చిన చట్టాల్లో అరుదైన చట్టం సమాచార హక్కు చట్టం అని చెప్పారు. సమాచారం తెలుసుకోవడం ప్రాథమిక హక్కు అని అన్నారు. సమాచార హక్కు చట్టంలో ప్రాంతీయ భాషలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమాచారం హక్కుపై నిర్వహించిన పోటీలు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో లావణ్య ప్రథమ బహుమతి (పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల), జాస్మిన్ ద్వితీయ బహుమతి (పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల), వక్తృత్వ పోటీల్లో వరలక్ష్మి ప్రథమ బహుమతి (పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల), అజయ్ ద్వితీయ బహుమతి (పీవీకేఎన్, చిత్తూరు)లు సాధించారు. ఆ విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు హరిప్రసాద్, జయచంద్రుడు, చెన్నకేశవులు, శరవణ, కోటేశ్వరరావు, రెడ్డిబాషా పాల్గొన్నారు.

పంచాయతీలకు ఈ-ఆటోలు, ఈ-స్కూటర్లు



ఈ-ఆటోలను పంచాయతీలకు పంపిస్తున్న ఎంపీడీఓ శిరీష

గుడిపాల: ఎన్నో రోజులుగా మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడి ఉన్న ఈ-ఆటోలు, ఈ-స్కూటర్లకు అధికారులు మోక్షం కల్పించారు. ఇదే విషయమై వారంరోజుల కిందట సాక్షి దినపత్రికలో 'ఎవరిదీ నిర్లక్ష్యం' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఆ కథనానికి స్పందించిన గుడిపాల ఎంపీడీఓ శిరీష పంచాయతీ కార్యదర్శులతో తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మూలన పడి ఉన్న ఈ-స్కూటర్లు, ఈ-ఆటోలను ఆయా పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పంపించారు. చిన్నచిన్న రిపేరీ ఉన్న వాటిని మరమ్మతులు చేయించి గ్రామాల్లో చెత్తసేకరణకు ఉపయోగించాలని ఆమె ఆదేశించారు.

ఐరాల ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు



ఐరాల: స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నరసింహులు కాణిపాకంకు బదిలీపై వెళ్లారు. కల్లూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఐరాలకు ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు.

బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐగా నాగసౌజన్య



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐగా నాగసౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు వద్దన్నారు. ప్రధానంగా మత్తులోకి వెళ్లవద్దన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. గంజాయి మత్తులో జోగిన కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నగర పరిధిలో ఆటో మ్యుటేషన్

రిజిస్ట్రేషన్‌శాఖలో సంస్కరణల పేరిట కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా అమల్లోకి తెస్తున్నారు. తొలుత వీటిని కార్పొరేషన్ పరిధిలో అమలు చేసి తదుపరి మున్సిపాలిటీల్లో అమలు చేయనున్నారు. ఈ విధానం ఆగస్టు 1 నుంచి చిత్తూరు నగర పరిధిలో అమలు కానుంది. ఇక పన్ను బకాయిలు ఉంటే ఆస్తులు రిజిస్ట్రేషన్ కావు. ఆ బకాయిల లేవని తగిన ఆధారాలు ఉంటేనే ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుంది.

- నేటి నుంచి అమలు
- మార్కెట్ విలువ ఆధారంగా మ్యుటేషన్ ఫీజు
- వాట్సాప్‌కు డాక్యుమెంట్లు



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఖాళీ స్థలం, ఇల్లు కొనుగోలు చేసుకున్నవారు ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయం ద్వారా రిజిస్టర్ దస్తావేజు ఆన్‌లైన్‌లో పంపితే అధికారులు పరిశీలించి టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తున్నారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు నగరపాలక అధికారులకు ఆన్‌లైన్ ద్వారా చేరుతాయి. అక్కడ పరిశీలించి ఆమోదం పొందగానే ఆటో మ్యుటేషన్ పత్రం జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త దస్తావేజు ఇస్తారు. మార్కెట్ విలువ, స్థలం, విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు.

పన్నుల రసీదు తప్పనిసరి

రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న ఆస్తి, నీళ్ల పన్నుల రసీదు సమర్పించాలి. స్థలమైతే వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) రసీదు అందజేయాలి. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమేటిక్‌గా నగరపాలక రికార్డుల్లో పేరు మారుతుంది. అవి లేని పక్షంలో పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నగరపాలక లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తించనుంది.

వాట్సాప్‌కు రిజిస్ట్రేషన్ పత్రాలు

ఇక నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న కొనుగోలుదారుడికి తక్షణమే రిజిస్ట్రేషన్ పత్రాలు వాట్సప్ ద్వారా రానున్నాయి. తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ దస్తావేజులు తీసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత డ్యాకుమెంట్లను స్కానింగ్ చేస్తారు. తదుపరి కొనుగోలుదారుడికి ఇచ్చిన మొబైల్ నంబర్ ఆధారంగా వాట్సాప్‌కు సంబంధిత డ్యాకుమెంట్లు పెట్టనున్నారు. కొత్తగా ఈ విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు. వీటిపై అధికారులకు, రైటర్లకు అవగాహన కల్పించమని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. వాట్సాప్‌కు డ్యాకుమెంటు పంపడం కొత్త విధానంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

2న వజ్రోత్సవ వేడుకలు ప్రారంభం

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 2వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటలకు వజ్రోత్సవ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణిస్తున్న అమరరాజా వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రా నాయుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ శేషన్, ఆదినారాయణరెడ్డి(అఫీషియల్ రిసీవర్ జిల్లా కోర్టు), నరసింహన్ హాజరువుతారని తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 3వ తేదీ ఆదివారం పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం, అలాగే ఉచితంగా క్యాన్సర్‌పై అవగాహన శిబిరం (క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్) ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమానికి ప్రస్తుత పాఠశాల, కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, దాతలు, విద్యావేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పూతలపట్టు(యాదమరి): సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని రంగంపేట క్రాస్ ఫ్లైవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు కచ్చితంగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని వాహనదారులకు సూచించారు. వాహన చోదకులు తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించి ప్రమాదాల నివారణకు తమవంతు సహకారం అందించాలని కోరారు. హెల్మెట్, లైసెన్స్, సీటుబెల్టు ధరించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేదంటే పెద్దమొత్తంలో జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా సీఐ వాహనదారులను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్‌ఐ తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



క్షీరసముద్రం పెద్దకాలువలో ఇసుక తోడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

శ్రీరంగరాజపురం: ఉచిత ఇసుక టీడీపీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంటి నిర్మాణం పేరిట పగలు ఇసుక డంపింగ్, రాత్రి వేళల్లో తమిళనాడుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేలు నుంచి రూ.7 వేలు వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని క్షీరసముద్రంలో పెద్దవంకలో జేసీబీ సహాయంతో కొంతమంది తెలుగు తమ్ముళ్లు అక్కడక్కడా సుమారు 350 లోడ్లకు పైగా ఇసుకను డంపింగ్ చేశారు. దీంతో స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బుధవారం సాయంత్రం జేసీబీని అడ్డుకుని ఆదుపులోకి తీసుకున్నారు. బుధవారం తహసీల్దార్ అందుబాటులో లేరు. దీంతో గురువారం తహసీల్దార్ లోకనాథపిళ్లై సీనియర్ అసిస్టెంట్ కళావతి ఇతర సిబ్బందితో కలసి క్షీరసముద్రం పెద్దకాలువతో పాటు గ్రామ పరిధిలో అక్కడక్కడా డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలించారు. తచ్చూరు-చిత్తూరు నూతన జాతీయ తహదారి జీఎంఆర్ పురం వంతెన కింద సుమారు 200 ఇసుక లోడ్లు డంపింగ్ చేసి అక్కడ నుంచి రాత్రి వేళల్లో తమిళనాడుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని తహసీల్దార్ సీజ్ చేశారు. వంతెన కింద ఎవరు డంపు చేశారో విచారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు రిజర్వు ఫారెస్టులోకి రెండు ఏనుగులు ప్రవేశించాయని, పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ బీటు అధికారిణి శ్రీదేవి తెలిపారు. రాత్రిళ్లు పొలాల దగ్గర పడుకోవద్దని, తెల్లని దుస్తులు ధరించి అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా కల్లూరు, గంటావారిపల్లె రోడ్డు మార్గంలో వెళ్లే వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.